


# ధ్యానం

"ఏమర్రా నేను ధ్యానంలో కూర్చోబోతున్నాను. అయిందానికి కానిదానికి నన్ను డిస్టర్బ్ చేయవద్దు ముందే చెబుతున్నాను"

"అవునే ఎంతసేపు కూర్చుంటావు"

"ఇవాళ ఏమైనా కొత్తా. నెలరోజుల నుండి చూస్తున్నారు. ఒక్క గంట. ఏమండీ ముఖ్యంగా మీకే. కూర్చున్న దగ్గరి నుంచి ఏమే ఇంకా కాలేదా అంటూ అరుస్తారు. కోడలు టిఫిన్ పెడుతుంది తిని కూర్చోండి"

అందరికీ చెప్పాల్సినవి చెప్పి గదిలోకెళ్లి చాపవేసుకుని కూర్చున్నాను.

ఆ గురువుగారి పుణ్యమా అని ఈ కాస్త ప్రశాంతత దొరికింది.

చాపమీద మఠం వేసుకొని కూర్చున్నాను.

"ఓం ఓం ఓం" అమ్మయ్య మూడుసార్లు ఓంకారం అయిపోయింది.

కళ్లు మూసుకున్నాను.

అవును పొయ్యిమీద పాలు పెట్టాను. ఆపానో లేదో. ఆపే ఉంటానులే.

"ఓం" ముక్కు పట్టుకున్నాను. ఈ రోజయినా కంసాలి దగ్గరకు వెళ్లాలి. ముక్కుపుడకల సీల వదులయింది. బాగు చేయించాలి. ఆ కంసాలివాడిని రమ్మన్నాను నల్లపూసలు కూడా అతుకుపోయింది.

"ఓం" దృష్టి కనుబొమల మధ్య కేంద్రీకరించాను.

కళ్ల సైట్ మారినట్టుంది. టీవీ సరిగ్గా కనిపించడం లేదు. అవునూ నిన్న సరిగ్గా సీరియల్ సమయంలో కరెంటు పోయింది కథ ఏమైందో, సునందకు ఫోన్ చేసి కనుక్కోవాలి.

"ఓం" దృష్టి వెన్నుపూస మీద కేంద్రీకరించాను.

"అమ్మగారు గిన్నెలెయ్యండమ్మా"

ఈ రంగి ఇప్పుడొచ్చింది. రోజూ చూసి చూసి నేను ధ్యానంలో కూర్చోగానే వస్తుంది. లేచేటప్పటికి వెళ్లిపోతున్నది. దొంగ పీనుగ.

దాని మొహం చూసి నెల రోజులవుతున్నది. నిన్న గిన్నె నిండా జిడ్డే. దరిద్రపు మొహంది అన్నీ ఎడ్డి పనులే. చెప్తా, చెప్తా.

అరే గడియాం అలారం పెట్టుకోటం మర్చిపోయాను. అయినా ఇప్పుడు పెడతాలే.

అవును ఎంతసేపు ధ్యానం అయి ఉంటుంది. అయిదు నిమిషాలు అయి ఉంటుంది. అట్లాగే పెడితే సరి.

"అమ్మాయీ టిఫిన్ పెట్టెయ్యమ్మా" ఆయన గొంతు.

ఏం టిఫిన్ చేసిందో ఏమిటో. అప్పుడే ఆకలేస్తున్నది. నిన్న ఇడ్లీ పచ్చడిలో ఉప్పు ఎక్కువ తగలేసింది.

"మామయ్యగారూ మీరు తిన్న తరువాత పిల్లల బడికి వెళ్లి వస్తాను. ఫీజు కట్టిరావాలి"

ఇంకేం బయటకు వెళ్లిందంటే అంతే సంగతులు. వంట చేసిందో లేకపోతే ధ్యానం అయింతరువాత మళ్లీ వంటింట్లోకి తగలడాలో ఏమిటో.

"ఓం ఓం ఓం" దృష్టి నాభి కేంద్రంలో.

వంటింట్లో గిన్నె కింద పడ్డ చప్పుడు.

అదిగో కాఫీ గిన్నె కింద పడ్డట్టున్నది. సొట్ట చేతులు ఒక్క వస్తువు సవ్యంగా పట్టుకోలేదు.

అన్నీ ఎత్తెత్తి పడెయ్యటమే. అంటే వంటిల్లంతా ఆగం..

"ఓం ఓం" దృష్టి హృదయం వైపు.

సాయంత్రం పార్టీకి వెళ్లాలి. చీర ఇస్త్రీకి ఇచ్చాను. ఆ వెధవ సమయానికి ఇస్తాడో లేదో. ఇంకా నగలు కూడా తేవాలి.

"ఓం ఓం" దృష్టి వెన్నుపూస మీద.

"అమ్మాయి తలుపు దగ్గరకు వేసుకో మీ అత్త ధ్యానం అయ్యే లోపల కూరలు తెచ్చేస్తాను. సుమా నువ్వు కూడా టిఫిన్ తినేయి"

ఏంటీ సుమ కాలేజీ సెలవు కదూ. అది ఇంట్లోనే ఉందన్నమాట. అయినా ఏం కూరలు తెస్తారో ఏంటో. నిన్న అన్నీ పుచ్చు వంకాయలే.

"ఓం ఓం" దృష్టి కంఠం మీద.

అవునూ ఈ పెద్దాడు నిన్న ఎన్నింటికి వచ్చాడో. ఈమధ్య రోజూ ఆలస్యంగా వస్తున్నాడు.

పొద్దున్న నేను ఇక్కడ కూర్చున్న తరువాత వెళ్లిపోతున్నాడు. రంగిని లాగే వాడిని చూసి కూడా చాలా రోజులయింది. రేపు ఆదివారం ఎట్లానైనా పట్టుకొని వాయించాలి.

"ఓం ఓం" దృష్టి శిరస్సు మీద..

చీపుర్లు...చీపుర్లు...కింద నుండి కేక

అయ్యో ఉన్న చీపురు పూర్తిగా పాడైపోయింది. ఈ కోడలు కొంటుందో లేదో. అదిగో వాడి గొంతు అప్పుడే అంత దూరం వెళ్లిపోయింది. మళ్లీ ఎప్పుడొస్తాడో ఏమో...

ట్రింగ్ ట్రింగ్.

ఫోను మోగుతున్నది. పెద్దదేమైనా చేసిందో ఏమో. మొన్న అసలే వేవిళ్లు వంట్లో బాగాలేదంది.

ఎట్లా ఉందో ఏమిటో? ఫోనూ ఆగిపోయింది. ఎవరూ ఎత్తినట్లు లేదు.

అలారం మోగింది.

అమ్మయ్య ఈవేల్టికి ధ్యానం ముగిసింది. అబ్బ ఎంత ప్రశాంతంగా ఉందో. కళ్లు తెరిచాను.

"అమ్మాయీ బాగా, ఆకలిగా ఉందమ్మా టిఫిన్ పెట్టు."

"ఇదిగో అత్తయ్యా"

"ఏంటి ఉప్మానా? ఆయనకు కూడా ఇదే పెట్టావా. అయినా ఉప్మా నాకిష్టం లేదని తెలిసీ చేశావా? ఇందులోకి నంచుకోటానికి నిన్నటి ఉప్పెక్కువైన పచ్చడేనా..? నీకు నేనంటే అసలు లెక్కలేకుండా పోతోంది. అయినా నిన్నని ఏం లాభంలేదు. వాడిననాలి నెత్తి కెక్కించుకున్నాడు"

అదిగో ఆయన కూరల సంచీ తీసుకొని లోపలికి వచ్చారు.

"ఈ రోజు ఏం తెచ్చారు. నిన్న పచ్చడి చేద్దామని వంకాయ తీస్తే పుచ్చు. బెండకాయ కూర చేద్దామంటే ముదురు...అమ్మాయి బయట చీపుర్లవాడు వచ్చాడు. ఇంట్లోది పాడయ్యింది. కొత్తది కొందామని ఆలోచన కూడా లేదేమే నీకు"

ఛీ..ఛీ ఇంతసేపు ప్రశాంతంగా ధ్యానం చేసుకొని వస్తే అంతా గాలికి కొట్టుకుపోయింది.

"అవునే అమ్మాయీ ఇందాక ఫోను మోగింది ఎవరది?"

"మీ అబ్బాయి కోసమత్తయ్యా లేరని చెప్పాను"

"పెద్దమ్మాయి చేసిందేమో అనుకున్నాను. ధ్యానంలో కూర్చున్నానే కానీ అమ్మాయి ఫోను చేసిందేమోననే ఆలోచన. కాస్త నువ్వయినా చేయొచ్చుగా. అయినా అంత ఆలోచన నీకుంటే ఇంకా అనుకునేదేమున్నది. అంతా నా ఖర్మ...ఆ రంగిని అడిగావా నిన్న పాలగిన్నె మీద తరకలు కూడా పోలేదు.? నిన్ననంగా నా చీర ఇస్త్రీకి తీసుకెళ్లాడు. అదైనా కనుక్కున్నావా? అన్నీ సమస్యలే. ఈ సంసారంలోంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందో ఏమో! నేను ఇంతసేపు పొందిన ఆనందం అంతా పటాపంచలు అయిపోయింది. అయినా నా బుద్ధి తక్కువ గానీ కోడళ్ల మీద సంసారాలు వదిలితే ఇట్లాగే అఘోరిస్తుంది. ఏ పనిమీదనైనా కాస్త ధ్యాసపెట్టి చేయవే అంటాను. దేనిమీద శ్రద్ధ లేదు. చెప్పి చెప్పి విసుగెత్తిపోతున్నాను. మేనకోడలని చేసుకుంటే ఇట్లాగే అఘోరిస్తుంది. మీ అందరి వల్లనే నాకు అంత బీపీ పెరిగిపోతున్నది. ఇంక ఈ జన్మ ఇట్లా వెళ్లిపోవలసిందే"

అయఁన
నోరు విప్పారు.

"ఇంతసేపు నువ్వు గదిలో కూర్చుని ఏం చేస్తున్నావు?"

గయ్యిమన్నాను. "ఏం ప్రశ్న. ఆమాత్రం తెలియదా ధ్యానం. అంటే మెడిటేషనొ"

"ఓహో అందులో ఏం చేస్తారు?"

"అదీ ఒక ప్రశ్నేనా? ప్రశాంతంగా ధ్యానిస్తారు. ఆ ప్రశాంతత అనుభవిస్తే తెలుస్తుంది. పొద్దస్తమాను ఆ పేపరు పట్టుకు కూర్చునే మీ బోటివాళ్లకు ఏం తెలుస్తుంది?"

"అంటే నీ ధ్యానంలో అరిగిపోయిన చీపుర్లు... నిన్నటి ఉప్పెక్కువైన పచ్చళ్లు, పుచ్చు వంకాయలు, చీరలు, ఎప్పుడో సరిగ్గా తోమని గిన్నెలు మీదనే మనసు కేంద్రీకరించమన్నారా? లేకపోతే కోడలిలో వంకలు ఏమేమి ఉన్నాయో లెక్కకట్టమన్నారా?"

"ఏంటీ మీ ఉద్దేశ్యం ఏం, నా ధ్యానం అంటే మీకు ఎగతాళిగా ఉన్నదా? మా గురువుగారు చెప్పారు. మీ మనసును ఫ్రీగా వదిలేయాలి. ఏ ఆలోచన వస్తే దాన్ని అట్లాగే రానీయాలి అని"




కొని కూర్చోనక్కర్లేదు. మెడిటేషన్ అంటే అర్థం ఒక పాజిటివ్ థింకింగ్ అలవరుచుకోమని అంతే కానీ కూర్చున్న కాస్సేపు కూర్చుని బయటకు రాగానే వాళ్లని వీళ్లని సాధించటం కాదు. పగలంతా నువ్వు చేస్తున్నదేమిటి? అమ్మలక్కల కబుర్లు. సీరియళ్లు. ఏనాడైనా ఒక్కరి గురించైనా ఒక్క మంచి మాటైనా నీ నోటెంబడి వచ్చిందా. నీకెవరితో సరిపడింది? అత్తగారు పడలేదు. ఆడపడుచులు పనికిరాలేదు. మరుదులు బావగార్లు తోడికోడళ్లు, ఏ ఒక్కరి గురించైనా ఒక్క మంచి అభిప్రాయం ఉందా. ఎంతసేపు అందరిలో లోపాలు ఎన్నటానికే జన్మ ఎత్తినట్టుంటావు. నీలోని లోపాలు ఎవరైనా చెప్పొస్తే ఊరంత గొంతు పెట్టుకొని గయ్యిమంటావు. కడుపులో ఇంత కోపతాపాలు ఉంటే బి.పి.లు, షుగరు ఎలా తగ్గుతాయి? ఇంక నోరు మూసుకొని ఈ నాటకం మానేసి పొద్దున్నే నా కాఫీ ఫలహారాలు వంటింట్లో పనులు చూసుకో"

అమ్మో ఆయనలో అంత ఆవేశం ఎప్పుడూ చూడలేదు.

అయినా బింకం సడలకుండా "ఛీ.. ఇంతే ఈ దరిద్రపు జీవితానికి ప్రశాంతంగా

"చాలు, చేసిన ధ్యానం చాలు. పొద్దున్నే అందరూ ఆఫీసులు, స్కూళ్లు అంటూ హడావుడిగా పరుగులు పెడుతూ ఉంటే ఆ గదిలో కూర్చుని లోకంలో విషయాలు కూడగట్టుకోవడానికి ధ్యానం అని పేరు పెట్టనవసరం లేదు. అది హాల్లో టీవీ చూస్తూ కూడా చేయవచ్చు. నెల రోజుల నుంచి చూస్తున్నాను. అక్కడ ఒక గంటసేపు పనిపాట మానేసి కూర్చోవటం ఎందుకు? బయటకు రాగానే నువ్వు ధ్యానంలో పొందిన ప్రశాంతత పోయిందని అందరినీ సాధించటం ఎందుకు? నిజంగా మెడిటేషన్ కోసం అంతసేపు కళ్లు మూసు

ఒక్క గంటసేపు ధ్యానం చేసుకునే యోగం కూడా లేదు" గట్టిగా అనుకుంటూ వంటింటివైపు నడిచాను.

ఎదురుగా అద్దంలో వెటకారంగా నన్ను చూస్తున్న మా వారి ప్రతిబింబం.

○